# తరుణోపాయం !

★

ముట్నూరు సంగమేశం

అప్పన్నకు గాఢంగా నిద్రపట్టలేదు. కష్టించి పండించిన గరిసెడు గింజల్లోనూ, కరణం చెప్పిన మాటలు చూస్తే-తవ్వెడైనా యింట్లో నిలచేటట్టు కనపడలేదు. తనూ పదిమంది పిల్లలూ యీ యేటికేడల్లా మలమలమాడిపోవటం తలచుకుంటే గుండె గ్రుంగిపోతూంది. ఏదో వడ్డి పదిహేను గరిసెలు పండి. పై పూరినుంచి నాలుగు బళ్ళు అంబారీవచ్చి, యింట్లో నిరుటిసరుకు నిలువవున్న రామినాయుడంటివాళ్లు, పందుమో పుట్టెడో సర్కారు కిచ్చేరంటే తన సెట్లా యివ్వగలడు. ఇరవై గరిసెల ధాన్యం యింట్లో నింపుకున్న నాయుడుదగ్గరా పది పుట్లే వసూలుచేసి; గరిసెడు గింజలు రాల్చిన తనదగ్గరా పదిపుట్లే వసూలుచేసి తీరతాననటం కరణానికేం ధర్మం! ఊళ్ళో ప్రజల ఉసురోసుకోవటం వీళ్ళకేమి జయమో !!

"అప్పన్నా, అప్పన్నా" అంటూ వినిపించింది ఏదో బొంగురుగొంతుక వీధిలోనుంచి.

దిగాలుగా, రాబోయే సంవత్సరాన్నెట్లా గడపటం, యిప్పటి అవసరాలెలా తరించడం అని ఆలోచనలమీద ఆలోచనలు సాగిస్తూ, నుక్క మంచంమీద గ్రుంగిపోయి కూర్చున్న అప్పన్న, యీ కేక విని మరింత గ్రుంగిపోయాడు. ఈ కేక అతనికి చిరపరిచితమైనదే. ఏటా యిదే మామూలు. గింజలింటికొచ్చాయి అనేసరికి వీధిలో తివిణీవేసి పిలుస్తూ ఉంటాడు షావుకారు సన్యాసయ్య. తన బాకీ వసూలుచేసుకోవలెందుకుగాను, కాబూలీవాడిని మించిపోయి అవతరిస్తాడా రోజున.

"అప్పన్నా, అప్పన్నా" యీసారి గొంతుక మరింత గట్టిగా, దీర్ఘంగాకూడా వినవచ్చింది. అప్పన్న మరి నిలవలేకపోయాడు. ఎదురుగుండా వెళ్ళి మాట్లాడడానికి శక్తికూడా చాలలేదు. ఈ అపాయం తప్పే ఉపాయంకూడా అతడికి తోచలేదు. కూర్చున్నవ్యక్తి లేచి నిలబడ్డాడు. మంచం కోటిదగ్గర నిలవ్వుంచిన, చుట్టపీక తీసి చేతితో పట్టుకోని, దుప్పటి పయిమీద వేసి వీధిగుమ్మం వైపు మొఖం త్రిప్పేడు. కాళ్ళు రాలేదు.

"అప్పన్నా ! ఏమిటన్నా పలకరేటి ! ఇంట్లో ఉన్నట్టా ! చచ్చినట్టా!" గోండ్రించాడు సన్యాసయ్య. ఇల్లంతా ప్రతిధ్వనించింది ఆవే శబ్దాలు. నిద్రలో ఉన్నవాడు పులిక్కిపడి లేచినట్లు లేచి ఒక్కొవచ్చాడు అప్పన్న వీధిలో నిల్చున్న షావుకారు సమీపానికి.

"ఏం! అప్పన్నా ! మా కదునుకి అప్పివ్వడం కారుండా, మా గుమ్మాలదగ్గర గంటలకొద్దీ మాకీ నిలువుజీతాలేటోయ్. గింజలు నీ యింట్లోకి నాలుగ్రోజులాయ వచ్చాయికదా యీపాటికి కొలిచిపంపేస్తే, మేమిలావస్తామా. మా యింటిచుట్టూ తిరుగుతూ కూర్చుంటే మా కవతల పనులేమవుతాయో కొంచెమైనా జ్ఞానం ఉండద్దూ" అని అతి దీర్ఘంగా తన కష్టసుఖాలుకూడా కలిపి వర్ణించడం మొదలెట్టాడు సెట్టి.

అసలుసంగతి షావుకారుకి అప్పన్న అయిదు రూపాయిలు బాకీ. ఆ బాకీకి వడ్డీక్రింద ఏటా, మూడుపుట్లు కొలుస్తూన్నా, యింకా వడ్డీ మిగులున్నాదని, అది అసలులో కలుపుతున్నానని, ఈరీతిగా గడుపులు పెంచి, తనకీ అప్పన్న యావజ్జీవిత ఆర్థిక ఒడంబడిక ఒకటి సృష్టించేడు షావుకారు. అతని అతి చాకచక్యంవల్ల, ఆ లెక్కనేర్పువల్ల అయిదు రూపాయిలతో ప్రారంభించిన ఆ బాకీ నేటికి ఎనభై అయిదు రూపాయిలని తేలింది. ఏటేటా వడ్డీక్రింద జమకట్టే గింజలు పుట్టెడో పందుమో పెరుగుతూన్నప్పటికీ, ఈ అసలు వృద్ధులు ఎందుకిలా పెరుగుతున్నాయో అప్పన్నకీ జన్మలో బోధపడని రహస్యం. అదేమో తెలుసుకుందామన్నా జిజ్ఞాసకూడా అతడికి లేదు.

"ఈ సంవత్సరం వడ్డీక్రింద పదిహేను పుట్లు రావాలోయ్ !" అన్నాడు షావుకారు. 'పదిహేనా?' అన్నాడు అప్పన్న నిలువునా గ్రుంగిపోతూనూ. 'సెట్టీ! కరణం ఓ ప్రక్కనుంచీ పది పుట్లు సర్కారికివ్వాలని పీడిస్తున్నాడు. నువ్వూ బాధిస్తే మరెలాగ చెప్పండీ! ఓ అయిదు పుట్లిస్తే కొంచెం కటాచ్చిస్తే నీ పేరు చెప్పుకో పిల్లలింత గంజినీరు త్రాగుతారు" అన్నాడు అప్పన్న.

కావలసినంతా గలభా జరిగేక లాభనష్టాల బేరీజులువేసినాక, పదిమందీ పోగయి సలహాలిచ్చిన వెనక ఎలాగో సెట్టి రాజీకి దిగి, పది పుట్లు కొలి

పించికొని, మిగిలిన అయిదుపుట్లకీ ధరకట్టి అస లుతో చేర్పించి క్రొత్తనోటు వ్రాయించుకో యింటిముఖం పట్టేడు.

"యీ పది యిలా పోయాయి. కరణంగారి పది పుట్లు తీసుకొన్నాడో, మిగిలిన పదిపుట్లు చాకలి, మంగలి, వడ్రంగివాళ్ళ జీతాలికిచ్చేస్తే యింట్లో యీ సాలుకి సాలూ పనులుపడి చావ వలసిందేనా; భగవంతుడా! ఏది దారి! ఎవ రూరుకుంటారు! అని కళ్ళంట నీళ్ళు నింపుకొంటూ, పుట్టెడు దిగులుతో మళ్ళీ నుక్కమంచం మీద కూలబడ్డాడు అప్పన్న.

ఆ మర్నాడు ఊరంతా హడావుడిగానే ఉంది. ఊళ్లోకి ప్రొక్యూరుమెంటు అధికార్లూ వచ్చారనే వార్త, యిట్టేయిట్టే చావుకబురులా ఊరల్లా వ్యాపించింది. కరణంగారి అరుగుమీద జరుగుతూన్న తతంగానికి అంతులేదు. కరణంగారి అనుయాయులు ఆడుతూన్న తెరవెనక భాగోతానికి మరుగులేదు: ధాన్యం కొలిపించుకొందామని వచ్చిన అధికార్లదృష్టి గింజలమీద కంటె గింగురుధ్వనులు వినిపించే నాణెంమీదికి ప్రసరిస్తున్నాయి ఎక్కువగా. వచ్చినవారంతా జేబులు ఎక్కువగా కుట్టించినవారే!

పది; పదిహేను గరిసెలు పండిన మోతుబరీ నాయిళ్ళు ఎవన్మందీ పదో, పాతికో ముదుపు చెల్లించి, పండు మా పుట్టెడో సర్కారికి కల్లుతుడుపుజేసి, కరణానికో కాగితం పారేసి, వాళ్ళ దగ్గరగాని, వాళ్ళవాళ్ళదగ్గరగాని గింజ అనేది మరి లేదనిపించేసుకున్నారు.

బస్తాలకి బస్తాలు పాకల క్రింద, వడ్లల క్రింద, బేరాలక్రింద కనూలుజేసి నిలవ్వేసిన షావుకారు సన్యాసయ్య ఏళ్ళరూపాయిలు నాది కావనుక్కనేసరికి, అందికి లేని బోడి సన్నాసిక్రింద గవర్నమెంటు లెక్కల్లో నమోదు అయిపోయాడు.

వచ్చిన అధికార్లు కాఫీ టిఫిను బాగా ఆరగించి, జేబులు నింపుకున్నప్పటికీ, లోకానికి చూసేందుకో గరిసెడైనా ఆ వూరినుంచీ పట్టుకెళ్ళాలనే పట్టుదల పట్టడం చిన్నరైతుల పీకమీదకి వచ్చింది.

కరణంగారు, దండాసి వెంకడు, మరో నలుగురు రైతులు, అయిదుగురు ఆఫీసర్లు అంతా దండయాత్రకి బయలేరినట్లు బయల్దేరారు యింటింటికిన్నీ. వాళ్ళ దృష్టిలో ఆ వూరులో వెంకుటిల్లు లేదు. ఉన్నవాళ్లా ప్రక్కకి పోనక్కరలేదు. పూరిపాకల్లోనే వాళ్ల ప్రొక్యూర్ మెంటు.

"ఇంతమందినీ చూసి అప్పన్న బెంబేలెత్తిపోయాడు. వాస్తవంగా తనకి పండిన గింజ గరిసెడే అయినా, అది సర్కారు లెక్కలో, కరణంగారి ధర్మమా అని, నాల్గు గరిసెలక్రింద నమోదు అయింది. పదిపుట్లు విధిగా కొలచి తీరాలన్నే పట్టు పట్టారు అధికార్లు.

'అప్పన్నా' అని కొంచెం దూరంగా పిలిచేడు దండాసి వెంకడు. 'నా మాటిన్ని ఓ రెండుబస్తాలు వెరటి తిన్న కరణాన్కి పంపిస్తూ, ఒక్క పందుంతో నీ వివ్వారం తెల్చేలా నాను సూత్తాను' అని సలహా యిచ్చాడు.

అప్పటి కదే తరుణోపాయం అని అప్పన్న యింటో కెళ్ళాడు. బస్తాలటు పంపి యిటొచ్చేసరికి ఏం జరిగిందో గాని వాకిట్లో ఒక్కపురుగు లేదు. మధ్యాహ్నం దండాసి వెంకన్న వచ్చి సర్కారికిచ్చే పందుము, తన కన్నీ ఓ పందుమూ కొలిపించేసుకున్నాడు.





బిటాకేఫిన్
(తలనొప్పి బిళ్ళలు)

అన్ని నొప్పులను జ్వరములను కుదుర్చును.

తలనొప్పి, పంటినొప్పి, కాళ్ళ నొప్పులు, కీళ్లనొప్పులు, నిద్రలేకుండుట, స్త్రీల బహిష్టు నొప్పులు, అలసట, మలేరియా, వగైరా అన్నిటికి గ్యారంటీగా పనిచేయును. వాడు కొను విధము పొట్లములో నుండును.

పొట్లం 3 బిళ్లలు 1 అణా

అన్ని మందుల షాపులలోను లభ్యమగును.

Stockists:
Messrs, Dadha & Co., P. T., Madras.
Manufacturers:
**BOMBAY TABLET MFG. CO.**
P. O. Box No. 2092. BOMBAY. 2